సాక్షి
యాదాద్రి భువనగిరి

శనివారం । 3 । ఆగస్టు । 2024



వృథా జలాలను ఒడిసిపట్టే..
రివర్సబుల్ టర్బైన్ల ద్వారా తిరిగి సాగర్‌కు నీటిని మళ్లించేలా టెయిల్‌పాండ్ ప్రాజెక్టు నిర్మితమైంది.
- 8లో



వృద్ధురాలు హత్య
ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు హత్యకు గురైన సంఘటన బ్రాహ్మణ వెల్లంలలో చోటు చేసుకుంది.
- 8లో



కోర్టు తీర్పు హర్షణీయం
ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునివ్వడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.
- 9లో

మరోసారీ..!

మెడికల్ కళాశాలకు మళ్లీ అనుమతి నిరాకరణ



మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఎంపిక చేసిన పాత కలెక్టరేట్ భవనం

- భవనంలో వసతులు సరిగా లేవన్న జాతీయ వైద్య విధాన మండలి
- అప్పీల్‌కు వారం రోజులు గడువు
- కళాశాల ఏర్పాటుకు ఇప్పటికే పాత కలెక్టరేట్ భవనం సిద్ధం
- ఫ్యాకల్టీలు, వైద్య విభాగాలకు అధిపతుల నియామకం
- ఈ ఏడాది వైద్య తరగతుల ప్రారంభంపై అనుమానాలు

సాక్షి, యాదాద్రి : మెడికల్ కళాశాల మంజూరైందంటే జిల్లా ప్రజలు ఎంతో సంబురపడ్డారు. ఎన్నో ఏళ్ల కల సాకారమైందని సంతోషించారు. కానీ, మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఎంపిక చేసిన భవనం నిబంధనలకు అనుగుణంగా లేదని, వసతులు సరిగా లేవనే కారణంతో జాతీయ వైద్యమండలి (ఎన్ఎంసీ) మరోమారు అనుమతి నిరాకరించింది. ఇప్పటికే ఒకసారి అనుమతి నిరాకరించగా మెడికల్ కళాశాల అధికారులు అప్పీల్‌కు వెళ్లారు. ఇటీవల వర్చువల్ ద్వారా తనిఖీలు చేపట్టిన జాతీయ వైద్య మండలి ప్రతినిధులు మరోసారి అనుమతి నిరాకరించడంతో మెడికల్ కళాశాల ఏర్పాటుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గత ఏడాది కళాశాల మంజూరు

జిల్లాకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో 100 సీట్లతో కూడిన మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి అదే సంవత్సరం జూన్ 5వ తేదీన జీఓ కూడా జారీ చేసింది. 2024–25 విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. కళాశాల భవన నిర్మాణం కోసం రూ.183 కోట్లు మంజూరు చేసి పరిపాలనా అనుమతుల కోసం సెప్టెంబర్ 16న జీఓ నంబర్ 162 ఇచ్చారు. కళాశాలలో అవసరమైన 433 పోస్టులను సృష్టించి జీఓ నంబర్ 124 విడుదల చేశారు. డీఎంఏ పరిధిలోకి వచ్చే విధంగా ఆదేశాలు ఇచ్చారు.

50 సీట్లకు కుదింపు

100 సీట్లతో మెడికల్ కళాశాల మంజూరు కాగా కాంగ్రెస్ ప్రభుత్వం 50 సీట్లకు కుదించింది. అయితే ముందుగా నిర్ణయించి విధంగా యాదగిరిగుట్టలో కాకుండా భువనగిరిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం పగిడిపల్లి సమీపంలోని పాత కలెక్టరేట్ భవనంలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలనుకున్నారు. దీనికోసం కలెక్టర్ హనుమంతు కే.జెండగే భవన యాజమాన్యంతో అద్దె, అగ్రిమెంట్ విషయంలో చర్చలు జరిపారు. యాజమాన్యం అనుమతి ఇవ్వడంతో భవనానికి మరమ్మతులు చేపట్టి, రంగులు కూడా వేశారు.

కళాశాల ఏర్పాటుపై నీలినీడలు

ఎన్ఎంసీ తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఈ ఏడాది మెడికల్ కళాశాల ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎంఎన్‌సీ కోరిన విధంగా కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్, జిల్లా ఆస్పత్రికి సూపరింటెండెంట్, ప్రొఫెసర్లను నియమించారు. భవనాన్ని సిద్ధం చేశారు. గత నెలలో జరిగిన వర్చువల్ మీటింగ్‌లో జాతీయ వైద్యమండలి అధికారులు చూపిన సమస్యలన్నింటినీ పరిష్కరించింది. తాజాగా వసతులు లేవని అనుమతులు నిరాకరించడంతో కళాశాల ఏర్పాటుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎన్ఎంసీకి అప్పీలు చేసుకోవడానికి అవకాశం

మెడికల్ కళాశాలకు ఎంపిక చేసిన పాత కలెక్టరేట్ భవనం నిబంధనలకు అనుగుణంగా లేదని, వసతులు సరిగా లేవని జాతీయ వైద్య మండలి మరోసారి అనుమతి నిరాకరించింది. వైద్య పరికరాలు, పర్నిచర్, ఇతర సౌకర్యాలు సరిగా లేవని పేర్కొంది. గతంలోనూ ఎన్ఎంసీ అధికారులు .. లోపాలు ఎత్తిచూపుతూ అనుమతి నిరాకరించడంతో అవసరమైన ఫ్యాకల్టీలను ప్రభుత్వం నియమించింది. కళాశాలకు భువనగిరి జనరల్ ఆస్పత్రిని అనుసంధానం చేశారు. అంతేకాకుండా 59 మంది నిపుణులైన వైద్యులు, ప్రధాన వైద్య విభాగాలకు అధిపతులను ప్రభుత్వం ఇటీవల నియమించి అనుమతికోసం అప్పీల్ చేసింది. కాగా ఇటీవల ఎన్ఎంసీ అధికారుల వర్చువల్ ద్వారా తనిఖీలు చేశారు. సౌకర్యాలు, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను రాష్ట్ర అధికారులు ఎన్ఎంసీకి అందజేసి అనుమతి స్తుందన్న నమ్మకంతో ఉన్నారు. కానీ, సరైన సౌకర్యాలే లేవన్న కారణంతో ఎన్ఎంసీ మరోసారి అనుమతి నిరాకరించింది. దీంతో మళ్లీ అప్పీల్‌కు వెళ్లనున్నట్లు వైద్యాధికారుతు చెబుతున్నారు. వారం రోజుల్లో అప్పీలు చేసుకోవాలని ఎన్ఎంసీ అవకాశం ఇచ్చినట్టు చెబుతున్నారు.



2024-25 జిల్లా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు, బ్యాంకు ప్రతినిధులు

వార్షిక రుణ ప్రణాళిక రూ.5,279 కోట్లు

- బ్యాంకులు ప్రభుత్వ లక్ష్యాలను వంద శాతం సాధించాలి
- కలెక్టర్ హనుమంతు కే. జెండగే

సాక్షి,యాదాద్రి : 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.5,279.34 కోట్లుగా నిర్దేశించామని, బ్యాంకర్లు తమ లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ హనుమంత్ కే.జండగే సూచించారు. శుక్రవారం కలెక్టర్‌లో బ్యాంకర్లతో రుణాల లక్ష్య సాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాధాన్యత రంగానికి రూ.4,513.9 కోట్లు, ప్రాధాన్యేతర రంగానికి రూ.766.25 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ప్రాధాన్యత రంగంలో అత్యధికంగా వ్యవసాయానికి రూ.3,636.27 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపార రంగాలకు రూ.762.29 కోట్లు, విద్యారంగానికి రూ.17.55 కోట్లు, గృహరుణాల కింద రూ.70.20 కోట్లు, సామాజిక, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.11.76కోట్లు, పునరుత్పాదక శక్తి కింద రూ.15.2 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వార్షిక రుణప్రణాళికను పూర్తి చేయాలని బ్యాంకర్లను కోరారు. రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎం పథకాల కింద లోన్లు ఇవ్వాలని, పాడి రైతులకు, మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ రుణాలు ఇవ్వాలని పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కు ఆర్థిక సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ మేనేజర్ శివరామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా పరిశ్రమల అధికారి రవీందర్, ఆర్బీఐ ఏజీఎం గోమతి, నాబార్డ్ డీడీఎం సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కృష్ణ, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి యాదయ్య, బ్యాంకర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సెక్షన్ ఆఫీసర్ల బృందం

గ్రామ సందర్శనలో భాగంగా జిల్లాలో పర్యటిస్తున్న కేంద్ర సెక్రటేరియట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం శుక్రవారం కలెక్టర్‌ను కలిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుతీరు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాల నిర్వహణ తదితర అంశాలపై అధ్యయనం చేసిన తమ అనుభవాలను కలెక్టర్‌కు వివరించారు. అధ్యయనం చేసిన విషయాలు ప్రజలకు ఉపయోగపడాలని కలెక్టర్ వారికి సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కృష్ణన్, జెడ్పీ సీఈఓ శోభారాణి, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రతినిధి వెంకటేశ్వర్లు, జిల్లా సీపీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం

సాక్షి,యాదాద్రి : ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ హనుమంతు కే.జెండగే ప్రారంభించారు. వివిధ పనుల నిమిత్తం, సమస్యలు విన్నవించడానికి ప్రజావాణికి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండాలని భావించి ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుదారులు లోటుపాట్లు ఉంటే సేవా కేంద్రాలకు వచ్చి సరిచేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళికా అధికారి వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

న్యూస్‌రీల్

'ఇంటింటా ఇన్నోవేటర్' దరఖాస్తు గడువు పెంపు

భువనగిరి టౌన్ : ఇంటింటా ఇన్నోవేటర్ దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈనెల 10 వ తేదీ వరకు పొడిగించిందని రాష్ట్ర ఇన్నోవేషన్ జిల్లా కో ఆర్డినేటర్ సుధీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువు తొలుత 3వ తేదీ వరకు ఉండగా 10వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అవకాశాన్ని ఆవిష్కర్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆవిష్కరణలను వాట్సాప్ నంబర్ ద్వారా 9100678543 పంపాలని పేర్కొన్నారు. ఆవిష్కరణ గురించి వంద పదాలకు మించకుండా ఉండాలన్నారు. ఆవిష్కర్త పేరు, వయస్సు, ఫొటో, వృత్తి, గ్రామం, మండలం తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ

ఆలేరురూరల్ : వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ శ్రీనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆలేరులోని ట్రాన్స్‌కో కార్యాలయంలో విద్యుత్ వినియోగదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే స్థానిక అధికారులకు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ సూర్యనాయక్, ఏఈలు వెంకటేష్, చింతలపని శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో మొగిపురుగు నివారణ

రాజాపేట : వరిలో మొగిపురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని భారతీయ వరి పరిశోధక సంస్థ కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం రాజాపేట మండలంలోని కుర్రారంలో ఎస్‌బీఐ, సేవా స్ఫూర్తి ఫౌండేషన్, వ్యవసాయ శాఖ, భారతీయ వరి పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో వరి సాగులో మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు సూచనలు చేశారు. మొగిపురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఉత్తమంగా పని చేస్తాయన్నారు. చాలా మంది రైతులకు పంటల సాగులో మెళకువలు తెలియకపోవడం వల్ల నష్టపోతున్నారని పేర్కొన్నారు. చీడ, పీడల బెడదనుంచి పంటలను కాపాడుకోవడానికి వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాధవి, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, ఏఈఓ అంజయ్య, రైతులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన సీడీపీఓలు

భువనగిరి టౌన్ : సాధారణ బదిలీల్లో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సీడీపీఓలకు స్థాన చలనం కలిగింది. భువనగిరి సీడీపీఓ రేఖల స్వరాజ్యం ఆలేరుకు, ఆలేరులో పనిచేస్తున్న చంద్రకళ దేవరకొండకు, రామన్నపేట నుంచి శాగంటి శైలజను భువనగిరికి బదిలీ చేశారు. కాగా రామన్నపేటకు తుంగతుర్తి సీడీపీఓ వెంకటరమణ బదిలీపై వచ్చారు. వీరు శుక్రవారం విధుల్లో చేరారు.

బస్వాపురంలో ఆరోగ్య మిషన్ ప్రతినిధులు



అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆరోగ్య మిషన్ ప్రతినిధులు

భువనగిరి రూరల్ : కేంద్ర ఆరోగ్య మిషన్ ప్రతినిధుల బృందం శుక్రవారం భువనగిరి మండలంలోని బస్వాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించింది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. ఆరోగ్యపరమైన సూచనలు చేశారు. చిన్నారుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు. క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలని పేర్కొన్నారు. అంతకుముందు అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్ ఊర్మిల, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ మౌనిక, డాక్టర్ పాండు, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బస్సులు లేవు.. బడికి ఎలా వెళ్లేది?



రాస్తారోకో చేస్తున్న మోటకొండూరు మండలంలోని కాటేపల్లి విద్యార్థులు

- మోత్కూరు– రాయగిరి రోడ్డుపై విద్యార్థుల రాస్తారోకో

మోటకొండూర్ : గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలకు తగినన్ని బస్సులు లేక విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. బస్సుల కోసం నిత్యం ఏదో ఒక చోట ఆందోళన చేస్తున్నా ఆర్టీసీ అధికారుల నుంచి స్పందన కరువైంది. శుక్రవారం మోత్కూరు – రాయగిరిపై రహదారిపై మోటకొండూరు మండలంలోని కాటేపల్లి విద్యార్థులకు ఆందోళనకు దిగారు. చదువుకోవడానికి రోజూ భువనగిరికి వెళ్తుంటామని, బస్సులు సకాలంలో రావడం లేదని, వచ్చిన సర్వీసులు కూడా ఆపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు, కాలేజీలకు వెళ్లడానికి ఆలస్యం అవుతుండడంతో తరగతులు నష్టపోతున్నామని వాపోయారు. సమస్యను గతంలో కూడా ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. ఇప్పటికైనా స్పందించి విద్యా సంస్థల సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలని కోరారు. విద్యార్థుల రాస్తారోకోతో గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు పోలీసులు.. అక్కడికి వచ్చి విద్యార్థులకు నచ్చజెప్పారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమింపజేశారు. కార్యక్రమంలో సతీష్‌చారి, దాసం నాగరాజు, వడ్లకొండ సాయికిరణ్, వల్లాల బాలమల్లేష్, గంధమల్ల రాజు, నాగిరెడ్డి తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

యాదాద్రి ఉద్యోగుల్లో త్వరలో 25 మంది బదిలీ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఉద్యోగుల బదిలీలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో 25 మంది వరకు బదిలీ కానున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిలింగ్‌కు యాదాద్రి ఆలయం నుంచి పలువురు ఉద్యోగులు హాజరయ్యారు. వీరిలో ఇద్దరు ఏఈఓలు, ఆరుగురు సూపరింటెండెంట్లు, 77 మంది జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు ఉన్నట్లు తెలిసింది. బదిలీకి సంబంధించి నేడో, రేపో ఉత్తర్వులు అందనున్నాయి. సోమవారం వరకు బదిలీలు జరగనున్నట్లు చర్చ జరుగుతోంది.

స్వర్ణగిరిని దర్శించుకున్న చినజీయర్ స్వామి

భువనగిరి : భువనగిరి జిల్లా కేంద్రం శివారులోని స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం త్రిదండి చినజీయర్ స్వామి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ధర్మకర్తలు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారి నిత్య కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అదేవిధంగా మైహోం అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు కుటుంబ సభ్యులతో శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.



చినజీయర్ స్వామికి శ్రీవారి ఫొటోను బహూకరిస్తున్న స్వర్ణగిరి ఆలయ ధర్మకర్తలు

నేత్రపర్వంగా ఊంజలి సేవోత్సవం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి, ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలోని ఊయలలో అమ్మవారి సేవను అధిష్టింపజేసి ఊంజలి సేవోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ఇక ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వయంభూలను మేల్కొలిపిన అర్చకులు.. వేదమంత్ర పఠనాలు పటిస్తూ పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో సువర్ణ పుష్పార్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్యతిరుకల్యాణం, గజవాహన సేవ, జోడు సేవోత్సవం తదితర ఆధ్యాత్మిక పర్వాలు చేపట్టారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.



ఆండాళ్‌దేవికి హారతినిస్తున్న అర్చకులు

ట్రాఫిక్ పోలీసులకు సీపీ అభినందన

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం శివారులో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో వేగంగా స్పందించిన చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీసులను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు అభినందించారు. రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ విజయ్‌మోహన్, ఏఎస్ఐ కాట్రగడ్డ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్స్ వెంకటరెడ్డి, ఫసియొద్దీన్, కానిస్టేబుళ్లు శంకర్, వీరభద్రయ్య, విజయ్‌కుమార్, శోభన్‌ను శాలువాలతో సత్కరించారు. విధి నిర్వహణలో తక్షణమే చొరవ చూపడాన్ని అభినందనీయమన్నారు. సకాలంలో స్పందించడం ద్వారా వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పాయన్నారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పని చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు.



చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీసులను అభినందిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు


వ్యాధుల నివారణకు.. వినూత్న పంథా

- సోషల్ మీడియా వేదికగా సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన
- వార్డుల వారీగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు
- వ్యాధుల వ్యాప్తి, కారకాలు, నివారణ చర్యలపై పోస్టులు
- మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం

భువనగిరి టౌన్ : గత పది రోజులుగా ముసురు వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్య, మున్సిపల్ శాఖలు అప్రమత్తమయ్యాయి. డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులకు అడ్డుకట్ట వేసేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. వ్యాధుల వ్యాప్తి కారకాలపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాయి. అపరిశుభ్రత, మురుగు నీరు, నిల్వ నీరు, అతిసార, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని ఆయా శాఖల అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అయితే సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఈసారి మున్సిపాలిటీల్లో అధికారులు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సోషల్ మీడియా వేదికగా అవగాహన కల్పిస్తున్నారు.

అన్ని మున్సిపాలిటీల్లో అమలు

జిల్లాలో భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, మోత్కూరు, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. అన్ని చోట్ల సోషల్ మీడియా ద్వారా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. గతంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పోస్టర్లు, కరపత్రాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించేవారు. మారుతున్న కాలానుగుణంగా సోషల్ మీడియాను వేదికగా చేసుకుని విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టణం, వార్డుల వారీగా వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసి ప్రజలను సైతం మమేకం చేస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రతలు, ఇంటి పరిసరాల్లో శుభ్రత, వ్యక్తిగత శుభ్రత తదితర అంశాలపై ప్రత్యేకంగా పోస్టర్లను ముద్రించి వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. కౌన్సిలర్లు, ఎన్‌జీఓ, మహిళా సంఘాలు తదితర స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధుల ద్వారా ప్రచారం కల్పిస్తున్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడవద్దనే ఉద్దేశంతో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు సోషల్ మీడియాను వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం భువనగిరి మున్సిపాలిటీలో సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటు దీంతో పాటు ఫీవర్ సర్వే కొనసాగుతోంది. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. బాధితులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.





సీజనల్ వ్యాధులపై సోషల్ మీడియా ద్వారా ప్రచారం కల్పించేందుకు ముద్రించిన పోస్టర్లు





వ్యాధులను అరికట్టడమే లక్ష్యం

ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలన్నదే లక్ష్యం. అందులో భాగంగా వ్యాధుల వ్యాప్తి, వాటిని అరికట్టేందుకు క్షేత్ర స్థాయిలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం .ఇందుకోసంసోషల్ మీడియాను వినియోగించుకుంటున్నాం.వ్యాధులు, వ్యాప్తి, నివారణ చర్యలను వివరిస్తూ ముద్రించిన పోస్టర్లను వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తున్నాం.

– రామాంజులరెడ్డి, కమిషనర్, భువనగిరి

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపాలిటీలో తాళం వేసిన ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రామాపురం రోడ్డులో గల రావిరాల బ్రహ్మారాంబ బీపీ టాబ్లెట్ల కోసం శుక్రవారం ఇంటికి తాళం వేసి మిర్యాలగూడకు వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులకొట్టి ఉంది. ఇంట్లో బీరువా తెరిచి ఉండడంతోపాటు, అందులోని బంగారం వస్తువులతో పాటు 36 తులాల వెండి, రూ.10 వేల నగదు చోరీకి గురికావడంతో పోలీసులకు సమాచారం అందించింది. సంఘటన స్థలానికి చేరుకున్న నేరేడుచర్ల పోలీసులు వివరాలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో 10 గొర్రెలు మృతి

నార్కట్‌పల్లి: మేత కోసం వెళ్లిన గొర్రెలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన శుక్రవారం నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జటంగి సోమయ్య గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం గొర్రెలను మేత కోసం గ్రామ శివారుకు తోలుకెళ్లాడు. ఈక్రమంలో మేత మేసిన అనంతరం దాదాపు 10 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దీంతో రూ.లక్షా70వేల నష్టం వాటిలినట్లు బాధితుడు వాపోయాడు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక


భార్గవాచారి

హుజూర్‌నగర్: కర్నాటక రాజధాని బెంగళూరులో ఈనెల 4, 5 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయినిగూడేనికి చెందిన కన్నెకంటి భార్గవాచారి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం అందుకు సంబంధించిన వివరాలను విలేకరులు తెలిపారు. గతనెల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. తన ఎంపికకు సహకరించిన ఉమ్మడి జిల్లా త్రోబాల్ కోచ్ ఎం.డీ.అక్బర్, తెలంగాణ సెక్రటరీ కిరణ్‌కుమార్, ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం కల్యాణతంతు నిర్వహించి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగించారు.

వృథా జలాలను ఒడిసిపట్టే.. టెయిల్ పాండ్

- సాగర్‌లో విద్యుదుత్పత్తి చేసిన నీటిని తిరిగి పంపింగ్ చేసేలా నిర్మాణం


టెయిల్ పాండ్ నుంచి విడుదలవుతున్న నీరు

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ వృథా జలాలు ఒడిసిపట్టి.. విద్యుదుత్పత్తి చేయడంతోపాటు రివర్సబుల్ టర్బైన్ల ద్వారా తిరిగి సాగర్‌కు నీటిని మళ్లించేలా టెయిల్‌పాండ్ ప్రాజెక్టు నిర్మితమైంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 21 కిలోమీటర్ల దిగువన పల్నాడు జిల్లా రెంటచింతల మండలం, సత్రశాల, నల్లగొండ జిల్లా, అడవిదేవులపల్లి గ్రామాల మధ్య కృష్ణా నదిపై దీన్ని నిర్మించారు. 2006 జూలై 3న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. సుమారు రూ.1100 కోట్లతో 2014లో నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చారు. టెయిల్‌పాండ్ నీటి నిల్వ సామర్థ్యం 7టీఎంసీలు, డెడ్‌స్టోరేజి 6 టీఎంసీలు, లైవ్ స్టోరేజి 1 టీఎంసీ. 1979 నుంచే ఇక్కడ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ పూర్తి చేయలేకపోయారు. భవిష్యత్‌లో ఎప్పటికైనా టెయిల్‌పాండ్ నిర్మిస్తారనే భావనతో నాగార్జునసాగర్‌లో ఏడు రివర్సబుల్ టర్బైన్లను ఏర్పాటు చేశారు. టెయిల్‌పాండ్ డెడ్‌స్టోరేజీ పైన ఉండే నీటితో సాగర్‌లోని రివర్సబుల్ టర్బైన్ల ద్వారా పీక్ అవర్‌లో విద్యుదుత్పత్తి చేస్తూ.. నీటిని తిరిగి సాగర్‌లోకి పంపిస్తారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టుపై ఆంధ్రా వైపున 50 మెగావాట్ల పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.

టెయిల్ పాండ్ నుంచి నీటి విడుదల

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రం సమీపంలో గల టెయిల్‌పాండ్ నుంచి శుక్రవారం దిగువకు నీటిని విడుదల చేశారు. నాగార్జునసాగర్ జలాశయం నుంచి 23,610 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. టెయిల్‌పాండ్ నాలుగు క్రస్ట్ గేట్లను 1.20 మీటర్లు పైకెత్తి 27,592 క్యూ సెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు టెయిల్‌పాండ్ డ్యాం ఏఈఈ జైపాల్ తెలిపారు.

జ్యూయలరీ షాపులో చోరీకి యత్నం

- సీసీ పుటేజీలో గుర్తించిన షాపు యజమాని
- పోలీసుల అదుపులో నిందితురాలు


మిర్యాలగూడ పట్టణంలోని పెద్దబజారులో గల జ్యూయలరీ షాపు వద్ద గుమిగూడిన జనం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని పెద్దబజారులో గల జ్యూయలరీ షాపులో శుక్రవారం ఓ మహిళ బంగారు నగల చోరీకి యత్నించింది. వివరాల ప్రకారం.. బుర్ఖా ధరించిన ఓ మహిళ పట్టణంలోని భవాని జ్యూయలరీ షాపునకు వచ్చింది. బంగారు ఆభరణాలు పరిశీలిస్తూ బేరం ఆడింది. అప్పటికే దుకాణంలో వినియోగదారుల రద్దీ ఎక్కువగా ఉండటంతో సేల్స్ ప్రమోటర్లు బిజీగా ఉండటాన్ని గమనించిన సదరు మహిళ రెండు బంగారు ఆభరణాలను తీసుకుని బయటకు వచ్చి ఆటోలో వెళ్లేందుకు ప్రయత్నించింది. ఇది సీసీ పుటేజీలో రికార్డు కావడంతో షాపు యజమాని గుర్తించి కేకలు పెట్టడంతో స్థానికులు ఆటోను అడ్డుకున్నారు. గమనించిన ఆటో డ్రైవర్ పారిపోగా మహిళ స్థానికుల చేతికి చిక్కింది. ఆమెను జ్యూయలరీ షాపులోకి తీసుకెళ్లి తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయి. పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడకు చేరుకుని మహిళను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కాగా.. పోలీసుల అదుపులో ఉన్న సదరు మహిళ సీతారాంపురం కాలనీకి చెందినదిగా స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేస్తున్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


రజిత (ఫైల్)

నకిరేకల్: ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన నకిరేకల్ మండలం నోముల గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కుటుంబీకుల వివరాలు ప్రకారం.. శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన గుండు శంభయ్య కుమార్తె అనిత అలియాస్ రజిత (28)ను నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన యల్మకంటి శ్రీనుకు 10 ఏళ్ల క్రితం ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఆరేళ్ల బాలుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. శ్రీను, రజిత నోముల గ్రామంలోనే చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీను, అతడి భార్య రజిత, ఇద్దరు పిల్లలు గురువారం రాత్రి నిద్రకు ఉపక్రమించారు. శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో శ్రీను నిద్ర లేచి చూసేసరికి భార్య కనిపించలేదు. పక్క గది డోర్ తెరిచి చూడగా ఇంటి పైకప్పు పైపునకు ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే శ్రీను భయంతో చుట్టుపక్కల వారిని పిలిచి కిందకు దించారు. అప్పటికే రజిత మృతిచెంది ఉంది. తన భార్యను గ్రామానికి చెందిన ఓ యువకుడు వేధింపులకు గురి చేయడంతోనే ఉరి వేసుకుందని శ్రీను ఆరోపిస్తున్నాడు. ఈమేరకు రజిత మృతదేహాన్ని ఆ యువకుడి ఇంటి ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ గోపికృష్ణ సంఘటన స్థలాన్ని సందర్శించి వారితో మాట్లాడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అక్కడి నుంచి నకిరేకల్‌కు తరలించారు. కాగా.. ఈ కేసు విషయంలో ఇరువర్గాలు రాజీపడడంతో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు.

తాటిచెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణం

- జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న గీతకార్మికుడు


తాటిచెట్టుకు వేలాడుతున్న వెంకటేశం మృతదేహం

మునగాల(కోదాడ): మతిస్థిమితం కోల్పోయిన భార్యకు సేవలు చేయలేక.. ముదివయసులో గీత వృత్తి చేసేందుకు ఒంట్లో సత్తువ లేక జీవితంపై విరక్తి చెందిన ఓ గీతకార్మికుడు.. తనకు ఉపాధి కల్పించే తాటిచెట్టుకే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న హృదయవిదాకర ఘటన మునగాల మండలంలోని ముకుందాపురంలో శుక్రవారం జరిగింది. ముకుందాపురం గ్రామానికి చెందిన గీతకార్మికుడు దేశగాని వెంకటేశం(80)కు సంతానం లేరు. భార్య లింగమ్మ సంవత్సరం క్రితం మతిస్థిమితం కోల్పోయింది. దీంతో వెంకటేశంకు ఇంటిపనితో పాటు భార్యకు సేవలు చేయాల్సి వస్తుంది. ఈ పనులే కాకుండా రోజువారీగా గీతవృత్తి చేస్తున్నాడు. కల్లు గీసేందుకు తాటిచెట్లు ఎక్కడంతో అలసిపోయి కొన్ని రోజులుగా మానసికంగా కూడా కృంగిపోతున్నాడు. ఈ దశలో జీవితం మీద విరక్తి చెందిన వెంకటేశం శుక్రవారం తాటిచెట్టుపైకి ఎక్కి తాటిమట్టకు ఉరివేసుకున్నాడు. కిందకు వేలాడగానే తన ఒంటిపై ఉన్న మోకును వదిలేశాడు. వెంకటేశం బంధువు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కాగా, వెంకటేశం మృతదేహాన్ని గ్రామానికి చెందిన గీత కార్మికులు కీర్తి నర్సయ్య, జూలు నాగార్జున కిందకు దింపే ప్రయత్నంలో ఒక్కసారిగా తాడు తెగడంతో మృతదేహం జూలు నాగార్జునపై పడింది. ఆయనకు స్వల్పగాయాలయ్యాయి.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి


మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

నల్లగొండ: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నల్లగొండకు చెందిన డీలర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలతో డీలర్లు ఇబ్బంది పడుతున్నారన్నారు. రేషన్ బియ్యం సరఫరా చేసే గోదాం పాయింట్లలో వేబ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని కోరారు. క్వింటాకు 1300 గ్రాముల ఖాళీ బస్తానే ఉంటుందని, దానికి కూడా బియ్యం ఇవ్వాలని, ఉచిత బియ్యం పంపిణీకి సంబంధించి కమిషన్‌ను అదే నెలలో మంజూరు చేయాలని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ, మాజీ కోశాధికారి జోగుపర్తి సత్యనారాయణ, మసూద్ కలీం ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మిర్యాలగూడ టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామానికి చెందిన ఇంద్రపల్లి సైదులు (42) గురువారం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు దాటుతుండగా కోదాడ నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో అతడి తలకు బలమైన గాయం కావడంతో ముందుగా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి అన్న ఇంద్రపల్లి సోమయ్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ వీరాంజనేయులుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా.. మృతుడికి వివాహం కాలేదు.

గుండెపోటుతో వలస కార్మికుడు మృతి


పంచనామా నిర్వహిస్తున్న ఎస్‌ఐ శ్రీను

కట్టంగూర్: బతుకుదెరువు కోసం వచ్చిన వలస కార్మికుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతుండగా శుక్రవారం గుండెపోటు రావడంతో మృతిచెందాడు. ఈ ఘటన కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం సోనాముఖి జిల్లా భంకూర మండలం బొందలతి గ్రామానికి చెందిన దిబాస్ బౌరి(19) కట్టంగూర్‌లోని ఓ కంపెనీలో కాంట్రాక్టర్ వర్కర్‌గా గత కొంతకాలంగా పనిచేస్తున్నాడు. ఈనెల 1వ తేదీన తీవ్ర కడుపునొప్పికి గురికావడంతో తోటి కార్మికులు నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అదేరోజు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స సమయంలో గుండెపోటు రావడంతో శుక్రవారం మృతిచెందాడు. సహచర కూలీ ఆకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీను తెలిపారు.

బత్తాయి కూలీల ఆటో బోల్తా..

- విద్యార్థి మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

చండూరు: చండూరు మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి బత్తాయి కూలీల ఆటో బోల్తా పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నాంపల్లి మండలం నేరెళ్లపల్లికి చెందిన కడారి అనిల్ (17) దామర భీమనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం తన తల్లిదండ్రులు శ్రీను, రజితతో కలిసి ఆటోలో 11 మందితో గుర్రంపూడ్ మండలం చామలోనిబాయి గ్రామంలోని ఓ రైతుకు చెందిన తోటలో బత్తాయి కాయలు తెంపేందుకు వెళ్లాడు. తిరుగుప్రయాణంలో రాత్రి చండూరు మున్సిపల్ కేంద్రంలోని పాత పారాబాయిల్డ్ రైస్ మిల్ సమీపంలో అతి వేగంగా వస్తున్న ఆటో ఒక్కసారిగా పల్టీ కొట్టింది. ఇందులో ప్రయాణిస్తున్న అనిల్ అక్కడికక్కడే మృతి చెందగా.. తండ్రి శ్రీనుతో పాటు మరో ఐదుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడుపుతూ సడన్ బ్రేక్ వేయడంతోనే పల్టీ కొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆటో డ్రైవర్ సాగర్ల శివకు స్వల్పగాయాలు కాగా.. పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

నాంపల్లి: విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన నాంపల్లి మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలంలోని కొండూర్ గ్రామానికి చెందిన వల్లపు కొండల్ (39)బత్తాయి వ్యాపారం చేసుకుంటూ మర్రిగూడ మండల కేంద్రంలోని కొత్తగూడెంలో జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా నాంపల్లి మండలంలోని పలు గ్రామాల్లో తిరిగి కొండూర్‌కు బైక్‌పై వస్తున్నాడు. ఈక్రమంలో నాంపల్లి మండలంలోని స్వాములవారి లింగోటం గ్రామంలో రాత్రి 8 గంటల సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

వలిగొండ: వలిగొండ మండలంలోని నర్సాయగూడెం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఆత్మకూర్(ఎం) మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన వల్లపు నర్సింహ(60) వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వలిగొండకు వచ్చాడు. తిరిగి మధ్యాహ్నం గ్రామానికి ప్రయాణమయ్యాడు. ఈక్రమంలో నర్సాయగూడెం గ్రామ సమీపంలో మొద్దులకుంట చెరువు వద్ద కారు అతివేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన నర్సింహ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్‌లాల్ తెలిపారు.

చైతన్య సదస్సును జయప్రదం చేయాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

భువనగిరిటౌన్ : తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాట్ కో) దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో నిర్వహించనున్న వినియోగదారుల చైతన్య సదస్సు ను జయప్రదం చేయాలని క్యాట్ కో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలె వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్వీ హోటల్ లో సదస్సు కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10,11(శని, ఆదివారం) నిర్వహించనున్న వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాట్ కో) చైతన్య సదస్సు, వర్క్ షాప్ కు రాష్ట్ర మంత్రులు, వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019, ఆన్ లైన్ మోసాలు, డ్రగ్స్, కల్తీ మొదలగు వాటిపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పోచం సోమయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా బాధ్యులు వెంకటేష్, అంజయ్య పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

తిరుమలగిరి (తుంగతుర్తి): విషం తాగి యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం తిరుమలగిరి మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన గిరిబాబు(22) తిరుమలగిరి మండలం అనంతారం గ్రామానికి చెందిన యువతిని ఇటీవల ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో యువతి తన తల్లిగారింటికి వచ్చింది. దీంతో మనస్తాపం చెందిన గిరిబాబు తిరుమలగిరికి చేరుకుని ఓ వెంచర్‌లో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని తుంగతుర్తికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ అపహరణ

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో ట్రాక్టర్ ట్రాలీని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి అపహరించారు. బొబ్బల ఇంద్రారెడ్డి తన వ్యవసాయ బావి వద్ద ట్రాక్టర్ ఇంజన్‌కు నాగళ్లు అమర్చి ఉండడంతో ట్రాలీని మరో చోట ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు మరో ట్రాక్టర్ ఇంజన్ సాయంతో ట్రాలీని అపహరించారు. బాధిత రైతు శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వృద్ధురాలి దారుణ హత్య

- నార్కట్‌పల్లి మండలం బి.వెల్లంలలో ఘటన
- గ్రామానికి చెందిన యువకుడే హత్య చేశాడని గ్రామస్తుల ఆరోపణ


వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ


జానకమ్మ (ఫైల్)

నార్కట్‌పల్లి: ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు హత్యకు గురైన సంఘటన శుక్రవారం ఉదయం నార్కట్‌పల్లి మండలంలోని బి.వెల్లంల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. బి.వెల్లంల గ్రామానికి చెందిన రెబ్బ జానకమ్మ (72)కు సంతానం కాకపోవడంతో ఆమె భర్త గత కొన్నేళ్ల క్రితం మరో వివాహం చేసుకుని చౌటుప్పల్‌లో ఉంటున్నాడు. దీంతో జానకమ్మ గ్రామంలో ఒక్కత్తే ఉంటోంది. ఆమె గురువారం చౌటుప్పల్‌కి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి చేరుకుంది. శుక్రవారం ఉదయం 7 గంటలైనా ఇంట్లోంచి బయటికి రాకపోవడంతో ఇంటి పక్కన ఉన్న వారు ఆమెను పిలిచారు. ఆమె పలకకపోవడంతో దర్వాజ సందులోంచి చూడగా ఇంటి లోపల బైక్ ఉంది. ఇంట్లో ఉన్నది ఎవరు అని అడగగా.. గ్రామానికి చెందిన ఓ యువకుడు స్పందించాడు. ఎందుకు వచ్చావని ఆ యువకుడిని ప్రశ్నించడంతోనే అతను తలుపు తీసి బైక్‌పై పరారయ్యాడు. గ్రామస్తులకు అనుమానం వచ్చి ఇంటిలోకి వెళ్లి చూసేసరికి జానకమ్మ మృతి చెంది ఉంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ నాగరాజు, ఎస్‌ఐ క్రాంతికుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. జానకమ్మను హత్య చేసి ఆమె మెడలో ఉన్న దాదాపు 10 తులాల బంగారం, కొంత నగదు దొంగలించినట్లు పోలీసులు గుర్తించారు. కాగా.. బైక్‌తో పరారైన యువకుడి కుటుంబ సభ్యులకు జానకమ్మ రూ.లక్ష అప్పు ఇచ్చిందని గ్రామస్తులు పోలీసులకు వివరించారు. గత 20 రోజుల క్రితం ఇంట్లో చోరీ జరిగిందని, అదే సమయంలో అప్పు పత్రం కూడా పోయినట్లు జానకమ్మ తమతో తెలిపిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆ యువకుడే ఇంట్లోకి దూరి ఒంటరిగా ఉన్న ఆమెను హత్య చేశాడని గ్రామస్తులు తెలిపారు. డీఎస్పీ శివరాంరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అయితే యువకుడు తీసుకున్న అప్పు కోసమే హత్య చేసి ఉంటాడా.. ఇందులో ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు. కాగా.. జానకమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.


నాగార్జున సాగర్ ఎడమ కాలువకు సాగునీటిని విడుదల చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి


లోలెవెల్ కెనాల్ నుంచి విడుదలవుతున్న నీరు


ఎడమ కాల్వకు నీటి విడుదల అనంతరం పూజలు చేసి గుమ్మడికాయ హారతి పడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి